క్లుప్తంగా

పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యత్వం ఇవ్వండి

పాల్వంచ: పదిహేను సంవత్సరాలుగా స్టార్ సేవా సంస్థ ద్వారా అనేక సంఘ సేవా కార్యాక్రమాలు నిర్వహిస్తోందని, తనకు నూతన ప్రభుత్వం పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో సభ్యత్వం ఇవ్వాలని సేవా సంస్థ డైరెక్టర్ ఎస్కే చాంద్ కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. తాను పొల్యూషన్ కంట్రోల్, పర్యావరణం, పల్స్‌పోలియో, ఎయిడ్స్, క్యాన్సర్ వంటి అనేక సంఘ సేవా కార్యాక్రమాలు నిర్వహించినట్లు చెప్పారు. ఈ విషయంలో గతంలో 2014 నుంచి ముఖ్యమంత్రులకు దరఖాస్తు చేసుకోగా, చీఫ్ సెక్రటరీలకు పంపించినా ఉపయోగం లేదన్నారు. కొత్త ప్రభుత్వంలో తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

డీడీ నిర్లక్ష్యంతోనే కుంటుపడిన విద్య



మాట్లాడుతున్న హరీష్

ఇల్లెందు: ఐటీడీఏ పాలన కుంటుపడిందని, డీడీ పర్యవేక్షణ, నిర్లక్ష్యం వల్లే ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో సమస్యలు పేరుకుపోతున్నాయని ఏఐఎస్ఎఫ్ ఆరోపించింది. శుక్రవారం ఇల్లెందులో ఏఐఎస్ఎఫ్ ముఖ్యకార్యకర్తల సమావేశం ఇల్లెందులోని సీపీఐ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర సమితి సభ్యుడు హరీష్ మాట్లాడుతూ... ప్రతీ నెల సమీక్ష సమావేశాలు నిర్వహించి విద్యార్థుల సమస్యలు పరిష్కరించాల్సిన డీడీ.. నెలలు గడిచినా ఒక్క సమావేశం కూడా నిర్వహించలేదన్నారు. హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలను రాకుండా ఆర్డర్లు ఇచ్చి ఇష్టారాజ్యంగా నడుచుకుంటున్నారని ఆరోపించారు. మండల కార్యదర్శి సాయి, సుభాష్, వెంకటేష్, నీరజ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

జూలూరుపాడు: ఉపాధి కూలీల సంఖ్య గణనీయంగా పెంచాలని అడిషనల్ డీఆర్‌డీఓ రవి అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఉపాధి క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్స్‌తో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామ పంచాయతీలో కనీసం 50 మంది ఉపాధి కూలీలు పని చేసేలా చూడాలన్నారు. అదే విధంగా నర్సరీల నిర్వహణపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని చెప్పారు. అంతకముందు అడిషనల్ డీఆర్‌డీఓ మాచినేనిపేట తండాలోని నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఈజీఎస్ ఏపీఓ రవి కుమార్, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయండి

జూలూరుపాడు: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని బీఎస్పీ బి.లలిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె పాపకొల్లు గ్రామ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులను కలిసి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత ప్రభుత్వం మల్టీ పర్పస్ విధానంతో గ్రామ పంచాయతీ కార్మికులతో వెట్టి చాకిరీ చేయించిందని, ఈ విధానాన్ని కొత్త ప్రభుత్వం రద్దు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించడంతోపాటు, నెలకు జీతం రూ.26,000 ఇవ్వాలన్నారు. జీపీ కార్మికులు భూక్యా లచ్చిరామ్, సిద్దెల సంజీవరావు, భూక్యా రాంబాబు, గుగులోత్ పారంగిణి, భూక్యా హాతిరామ్, కొత్తపల్లి కళావతి, దినేష్ పాల్గొన్నారు.

జాన్‌వెస్లీకి సన్మానం

కొత్తగూడెంఅర్బన్: అంతర్జాతీయ గాయకుడు జాన్‌వెస్లీని కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో శుక్రవారం గాంధీపథం జిల్లా అధ్యక్షుడు చింతలచెర్వు గెర్షోము సన్మానించారు. మాట్లాడుతూ.. ఐక్య క్రిస్మస్ సందర్భంగా జాన్‌వెస్లీ కొత్తగూడెం విచ్చేశారని, అంతర్జాతీయ స్థాయిలో ఆయన గానానికి ప్రత్యేక అభిమానులున్నారని తెలిపారు. సన్మానించిన వారిలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, గాంధీపథం సభ్యులు క్రిష్టఫర్, జ్ఞానవినోదిని, ఎలిజిబెత్ తదితరులు ఉన్నారు.

వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కొత్తగూడెంఅర్బన్: హెల్త్ కార్డులున్న కార్మికులు ఉచిత వైద్య పరీక్షల శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని 25వ వార్డు కౌన్సిలర్ సాహేరాబేగం అన్నారు. శుక్రవారం వార్డులో సీఎస్‌సీ హెల్త్‌కేర్ వారి ఆధ్వర్యంలో కార్మికులకు ఉచిత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శారద, టీచర్లు రాజకుమారి, పద్మ, శైలజ, ఆయాలు, ఆశాలు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అమల్లోకి జీరో టికెట్

- ఇక మహిళలు గుర్తింపు కార్డు చూపాల్సిందే..
- ఏదో ఒక కార్డు ఉంటేనే బస్సుల్లో ఉచిత ప్రయాణం


కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులు

చుంచుపల్లి: కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా తొలుత ఈ నెల 9వ తేదీ నుంచి ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం వెసులుబాటును కల్పించింది. ఈ పథకం ప్రారంభం సందర్భంగా మహిళలకు ఎలాంటి షరతులు లేకుండానే బస్సుల్లో ప్రయాణించే సౌకర్యం కల్పించారు. వాస్తవంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించాలంటే ఏదో ఒక ఆధారం చూపాల్సి ఉంది. అయితే ఆర్టీసీ యాజమాన్యం ఈ విషయంలో వారం రోజులపాటు ఎటువంటి నిబంధనలు అమలుచేయలేదు. ఎట్టకేలకు గురువారం అర్ధరాత్రి నుంచి పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో జీరో టికెట్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ప్రయాణం చేయాలనుకుంటే ఇక నుంచి తగిన గుర్తింపు కార్డులను కండక్టర్‌కు చూపించాల్సి ఉంటుంది. అప్పుడే కండక్టర్ వివరాలు నమోదు చేసుకొని జీరో టికెట్‌ను జారీ చేస్తారు. లేదంటే టికెట్‌కు డబ్బులు చెల్లించాలి. కొత్తగూడెం పరిధిలో కొత్తగూడెం, ఇల్లెందు డిపోలు ఉన్నాయి. వీటి పరిధిలో 39 పల్లె వెలుగు బస్సులు, 22 ఎక్స్‌ప్రెస్ సర్వీసులు కొనసాగుతున్నాయి. రెండు డిపోల పరిధిలో రోజుకు కనీసం 20 వేల మంది వరకు ప్రయాణికులు ఆర్టీసీలో తమ గమ్యస్థానాలకు వెళ్తున్నారు. ఇందులో 40 శాతం వరకు మహిళల ప్రయాణికులు ఉండగా, ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చిన తర్వాత వీరి శాతం మరింతగా పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటి వరకు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో బాలికలు, యువతులు, మహిళలు, ట్రాన్స్‌జెండర్లు ఉచిత ప్రయాణం చేసినప్పటికీ ఎలాంటి గుర్తింపు కార్డులను కండక్టర్లు అడగలేదు. ఎలాంటి టికెట్లు కూడా మహిళలకు ఇవ్వలేదు. రోజుకు ఎంతమంది ఉచిత ప్రయాణం చేశారనే వివరాల అంచనాను కండక్టర్లు కేవలం ఎస్ఆర్‌లో మాత్రమే నమోదు చేశారు. దీంతో కచ్చితమైన గణాంకాలు డిపోల పరిధిలో నమోదు కాలేదు. ఒక గురువారం అర్ధరాత్రి నుంచి అమల్లో వచ్చిన విధానం ద్వారా మహిళలు తప్పనిసరిగా వారి ధ్రువీకరణను తెలిపే ఆధార్, ఓటర్ కార్డు లేదా రేషన్ కార్డును చూపించి జీరో టికెట్‌ను తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇదే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ఉన్నతాధికారులు డిపోలకు సూచనలు చేశారు. ఎవరైనా మహిళలు తమ దగ్గర ఆధారం చూపకపోతే కచ్చితంగా టికెట్ తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. గుర్తింపు కార్డు ఉంటేనే ఇక నుంచి ఆర్టీసీ బస్సుల్లో జీరో టికెట్‌ను జారీ చేస్తామని ఆర్టీసీ చెబుతోంది. ఆర్టీసీలో జీరో టికెట్ విధానం అమలు ద్వారా సంస్థలో ప్రయాణించే మహిళా ప్రయాణికుల సంఖ్యతో పాటు రోజువారీ సంస్థ కోల్పోయే ఆదాయ వివరాల లెక్కలు స్పష్టంగా ఉంటాయి. కండక్టర్లు జారీ చేస్తున్న జీరో టికెట్‌పై మహిళలు ఎక్కడి నుంచి ఎక్కడి వరకు ప్రయాణిస్తున్నారో స్టేజీల వివరాలు, కిలోమీటర్ల వివరాల వంటివి ఉంటాయి. దాని ప్రకారం వివిధ బస్సుల్లో ప్రయాణించే మహిళల వివరాలను కండక్టర్లు ఎస్ఆర్‌లో నమోదు చేసుకునే వీలుంటుంది.


ఆధార్ కార్డు పరిశీలించి జీరో టికెట్ జారీ చేస్తున్న కండక్టర్

గుర్తింపు కార్డ్ తప్పనిసరి..



ఆర్టీసీ యాజమాన్యం సూచనల మేరకు ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే మహిళల కోసం వారి ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డులను పరిశీలించి జీరో టికెట్‌ను జారీ చేస్తున్నాం. ఇది గురువారం అర్ధరాత్రి నుంచి అమలు చేస్తున్నాం. అన్ని పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ టిమ్స్ సర్వీసుల్లో ఈ సౌకర్యం కల్పించారు. మహిళా ప్రయాణికులు కూడా గుర్తింపు కార్డులు తెచ్చుకుంటున్నారు.

– టి.కృష్ణారావు, కండక్టర్

ఆధార్ కార్డ్ తెచ్చుకున్నా...



కొత్తగూడెం నుంచి ఇల్లెందు వెళ్తున్నాను. బస్సు ఎక్కగానే కండక్టర్‌కు చూపించడానికి ఇంటి నుంచి వచ్చేటప్పుడే ఆధార్ కార్డు వెంట తెచ్చుకున్నాను. ఆధార్ కార్డు వివరాలను పరిశీలించి కండక్టర్ నాకు జీరో టికెట్ ఇచ్చారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా మొదటిసారి ప్రయాణించటం సంతోషంగా ఉంది. ఇది మాకు ఎంతో ఉపయోగకరమైన పథకం. ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– ఆర్.లక్ష్మి, ప్రయాణికురాలు

12 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు


మాట్లాడుతున్న మండే వీరహనుమంతరావు

చుంచుపల్లి: కొత్తగూడెం సొసైటీ పరిధిలో మొత్తం 12 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతరావు తెలిపారు. శుక్రవారం హౌసింగ్ బోర్డులోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు ప్రభుత్వ మద్దతు ధరకు కొనడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టుకుని సంబంధిత అధికారి వద్ద టోకెన్ తీసుకున్న తర్వాత మాత్రమే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో సొసైటీ డైరెక్టర్లు బండి అమృతరావు, గుగులోత్ చందర్, తీట్ల విజయకుమారి, పోటు వెంకటేశ్వరరావు, గుగులోత్ విజయ, కంటెం సత్యనారాయణ, సొసైటీ సెక్రటరీ పండ్ల సారయ్య పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


డీటీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: మిచాంగ్ తుపాన్ వలన నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, కౌలు రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ టేకులపల్లి మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్, ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి గుగులోతు రామచందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, అఖిల భారత రైతుకూలీ సంఘం (ఏఐకేఎంఎస్) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా టేకులపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ముత్తయ్యకు వినతిపత్రం ఇచ్చారు. మాట్లాడుతూ... రాత్రింబవళ్లు కష్టపడి పండించిన పంటలు ఒక్కసారి నేలమట్టం కావడంతో రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారని వాపోయారు. ఈ క్రమంలో రైతులు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నట్లు చెప్పారు. ప్రభుత్వాధికారులు తక్షణమే దెబ్బతిన్న పంటలను సర్వే చేసి నష్టపరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో చింత శ్రీరాములు, సమ్మయ్య, లక్ష్మి, పొట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ ఉద్యోగుల సమ్మె

సింగరేణి(కొత్తగూడెం): గ్రామీణ తపాలా ఉద్యోగుల సమస్యలను 2018 కమలేష్ చంద్ర కమిటీ సమర్పించిన రిపోర్ట్‌లో చేర్చి ఉద్యోగులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ కొత్తగూడెం పోస్టాఫీస్ ఎదుట ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం అయిదో రోజుకు చేరింది. ఖమ్మం డివిజన్ జీడీఎస్, పీజేఏసీ నాయకులు టి.విజయరాజు మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉద్యోగులు చేస్తున్న సమ్మె తెలిసి కూడా కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవటం విచారకరమన్నారు. ప్రభుత్వమే ఐదు సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవటం సరైంది కాదని, ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన కోర్కెలను పరిష్కరించి, సమ్మెను విరమింపజేయాలి విజ్ఞప్తి చేశారు. ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్, యూనియన్, గ్రామీణ డాక్ సేవక్స్ సంఘాల నాయకులు వై.పట్టాబి, మౌలాలి అహ్మద్, ఏఏ ఖాన్, ఎం.వెంకటేశ్వర్లు, వాహెబ్, షేక్ ఖలీల్, వెంకటకృష్ణ, వినయ్ సుధీర్, త్రివేణి, బొల్లం వెంకన్న శ్రీను, లక్ష్మీభారతి, సాహిత్య, రిజ్వానా పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి


మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: ఆటో డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని, వారికి జీవన భృతి చెల్లించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్మిక విభాగం జిల్లా సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ... నూతన రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం వలన ఆటో కార్మికులు రోడ్డున పడ్డారన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల నుంచి డ్రైవర్లకు కనీస వేతన జీఓ విడుదల చేయలేదని గుర్తు చేశారు. డ్రైవర్లకు కనీస వేతనం జీఓ 25 విడుదల చేయాలని, ట్రాఫిక్ చలాన్లు రద్దు చేయాలని, ప్రతీ ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి రూ.15,000 ఆర్థిక సహాయం అందచేయాలని, రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. రవాణా వాహనాలపై సింగిల్ పర్మిట్ విధానాన్ని ప్రవేశపెట్టాలని, రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాయి, చేనిగారపు నిరంజన్ కుమార్, నాగుల రవికుమార్, వంగా రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు ఆహ్వానం

పాల్వంచ: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్, ఐటీసీ సహకారంతో భద్రాచలంలోని ప్రథమ్ బ్యూటీ శిక్షణ కేంద్రంలో బ్యూటీషియన్ కోర్సు, బూర్గంపాడులోని ప్రథమ్ ఎలక్ట్రికల్ శిక్షణ కేంద్రంలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ అప్సా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ తర్వాత వంద శాతం ఉద్యోగం కల్పించడం జరుగుతుందని, కోర్సు 35 రోజులు ఉంటుందని, అర్హత కనీసం పదో తరగతి పాస్ అయి ఉండాలని తెలిపారు. వివరాలకు 9394893703 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ స్కూల్‌కు గేటు వితరణ


గేటు అందిస్తున్న ప్రకాశ్

పాల్వంచ: పాత పాల్వంచ అంగన్‌వాడీ పాఠశాలకు శుక్రవారం గేటు వితరణ చేశారు. పాఠశాలకు గేటు లేక పశువులు, బయటి వ్యక్తులు లోపల తిరుగుతుండటంతో పిల్లలకు ఇబ్బంది అవుతుందని వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాశ్ దృష్టికి తీసుకురావడంతో రూ.6వేల నగదుతో గేటు తయారు చేయించి కేంద్రం నిర్వాహకురాలు మంజులకు అందించారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

జూలూరుపాడు: పాపకొల్లు, జూలూరుపాడు, పడమటనర్సాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో శనివారం మరమ్మతులు చేపడుతున్నారు. ఈ మేరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జూలూరుపాడు ఏఈ సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.

ఇన్‌చార్జ్ కార్యదర్శి నియామకం

ఇల్లెందురూరల్: బాలాజీనగర్ ఇన్‌చార్జ్ కార్యదర్శిగా రజినీకాంత్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎంపీఓ చిరంజీవి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు కార్యదర్శిగా ఉన్న నీలిమ సెలవుపెట్టడంతో సుభాష్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రజినీకాంత్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

రాజీనామా

సింగరేణి(కొత్తగూడెం): జీకేఓసీలో ఈపీ ఆపరేటర్ లింగాల జోసెఫ్ ఒకవైపు విధులు నిర్వహిస్తూ మరోవైపు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) యూనియన్‌లో జీకే ఓసీ పిట్ సెక్రటరీగా, జీఎం కమిటీ సభ్యుడిగా ఉన్నారు. అయితే ఈ రెండు పోస్టులకు, టీబీజీకేఎస్ యూనియన్‌కు రాజీనామా చేస్తున్నట్లు శుక్రవారం మీడియాకు తెలిపారు.

మంత్రి తుమ్మలకు శుభాకాంక్షలు


కొత్తగూడెంరూరల్: మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీతారాములు


తుమ్మలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, పాయం వెంకటేశ్వర్లు

కొత్తగూడెంరూరల్: వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్‌లో సచివాలయంలోని నూతన చాంబర్‌లో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో హరిబాబు, ఎండీ కరీం పాషా, సైదుబాబు, బొల్లం ఉదయ్‌కుమార్, సాయి, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

జూలూరుపాడు: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సచివాలయంలో శుక్రవారం కలిశారు. సెక్రటేరియట్‌లో ఆయనకు కేటాయించిన చాంబర్‌లో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన తుమ్మల నాగేశ్వరరావును ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్ ఉన్నారు.

సీపీఎస్ రద్దుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న రాజు

టేకులపల్లి: సీపీఎస్ రద్దుకు నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.రాజు, జిల్లా అధ్యక్షుడు భూక్యా కిషోర్‌సింగ్ కోరారు. ఈ మేరకు టేకులపల్లి మండలం టీఎస్ యూటీఎఫ్ పదో మండల మహాసభ శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ సమీపంలో జరిగింది. తొలుత సంఘం జెండా ఎగురవేసి మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలుపుతూ టీఎస్ యూటీఎఫ్ పక్షాన సంపూర్ణ మద్దతు సహకారం ఉంటుందని మేనిఫెస్టో అంశాలను అమలు చేయాలని అందులో భాగంగా సీపీఎస్ను రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని అదేవిధంగా ప్రతి మండలానికి ఇంటర్నేషనల్ పాఠశాల మంజూరు చేయాలని, ఉపాధ్యాయుల పెండింగ్ బదిలీల ప్రమోషన్లపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. టెట్ మినహాయింపుకు సంబంధించి ప్రత్యేక పరీక్షలు నిర్వహించాలని కోరారు. జీఓ 317 ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. అదే విధంగా ఈ కుబేర్‌లో ఉన్న అన్ని పెండింగ్ బిల్లులను జమ చేయాలని జీతాలు ఒకటో తేదీనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యారంగం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. వివిధ సంక్షేమ శాఖ ఉపాధ్యాయ పెండింగ్‌లో ఉన్న బదిలీల ప్రమోషన్ ప్రక్రియను వెంటనే చేపట్టాలని హాస్టల్‌లో ఉన్న అన్ని పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని అదేవిధంగా ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని కేజీబీవీ యూఆర్ఎస్ కాంట్రాక్టు ఉపాధ్యాయులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంగతాయారు, ప్రధాన కార్యదర్శి నంది కృష్ణ , ఉపాధ్యక్షురాలు వరలక్ష్మి, మండల ప్రధాన కార్యదర్శి నరసింహారావు, రాంజీ, మాన్సింగ్, బాలు నాయక్ కృష్ణ, రామచందర్, సుశీల జానకి జ్యోతి, రమేష్ కేవీ పాల్గొన్నారు.

కార్మికులకు కాలనీలు కట్టిస్తాం..


మాట్లాడుతున్న మాధవ నాయక్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు కాలనీలు కట్టించి, సొంతింటి కల నెరవేరుస్తామని, రానున్న సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో బీఎంఎస్ గుర్తు కాగడా గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆ సంఘం జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్ కార్మికులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని జేవీఆర్ ఓసీ సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా 40 వేల కార్మిక కుటుంబాలకు నివాస యోగ్యమైన జిల్లా కేంద్రాలలో 250 గజాల ఇంటి స్థలం కేటాయిస్తామని, ఇంటి నిర్మాణానికి రూ.20 లక్షల వడ్డీ లేని రుణ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. గత ముఖ్యమంత్రి సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేస్తామని గత ఎన్నికల్లో హామి ఇచ్చి నీరుగార్చారన్నారు. సింగరేణి కార్మికులు సైనికులతో సమానమని, చీకటి సూర్యులని అసెంబ్లీ సాక్షిగా ఎన్నో మాటలు చెప్పి, ఇప్పటి వరకు సొంతింటి కలను అమలు చేయలేక పోయారని విమర్శించారు. మొగిలిపాక రవి, పవన్‌కుమార్, వి.నాగప్రసాద్, సంఘం చందర్, ఉప్పు శ్యామ్ సుందర్, మల్లారెడ్డి, ఐత రవి, శ్రీకాంత్, చారి, హతిరాం, వీఎస్ మూర్తి, రాజమౌళి, అల్లి ప్రకాశ్, బీమా పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి


మాట్లాడుతున్న రజాక్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో ఐదేళ్లుగా కార్మికులకు నిస్వార్థంగా సేవలందించింది టీబీజీకేఎస్సేనని ఆ సంఘం ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ అన్నారు. శుక్రవారం జీకేఓసీ, పీవీకే–5షాఫ్ట్ గనులపై ఏర్పాటు చేసిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ప్రాతినిధ్యంలో కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా వారి సమస్యలను పరిష్కరించామన్నారు. అదేవిధంగా కరోనా సమయంలో కూడా వైద్యసేవలు అందించిన ఘనత తమ యూనియన్‌దేనన్నారు. కార్మికులు ఆలోచించి ఓటెయ్యాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కూసన వీరభద్రయ్య, కాపు కృష్ణ, గోప కుమార్, చిలక రాజయ్య, చెరిపెల్లి నాగరాజు, గడప రాజయ్య, సదానందం, చాట్ల రామారావు, రాజేంద్రప్రసాద్, భద్రయ్య, రాజశేఖర్, ధార్యా, విజయ్‌కుమార్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం..


సాబీర్‌పాషాను సన్మానిస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం పట్టణానికి తాగు నీరందిస్తున్న కిన్నెరసాని నీటి ప్రాజెక్ట్‌లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, కార్మికులకు కమ్యూనిస్ట్ పార్టీ అండగా ఉంటుందని సీపీఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్‌పాషా అన్నారు. శుక్రవారం వారి సమస్యలపై వారితో చర్చించారు. మాట్లాడుతూ... సుదీర్ఘకాలంగా ఈ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న కార్మికులు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు శ్రమిస్తున్నారని వీరికి అధికారులు శ్రమకు తగిన వేతనం సకాలంలో అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా కార్మికులు పాషాను శాలువాతో సన్మానించారు.

అంగన్‌వాడీల్లో ఇంకుడు గుంతల నిర్మాణం


జూలూరుపాడు న్యూకాలనీలో ఇంకుడు గుంత మార్కింగ్‌ను పరిశీలిస్తున్న నిర్మలజ్యోతి

జూలూరుపాడు: మండలంలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం ఇంకుడు గుంతల నిర్మాణానికి అధికారులు మార్కింగ్ ఇచ్చారు. సొంత ప్రభుత్వ భవనాలు ఉన్న 19 అంగన్‌వాడీ కేంద్రాల్లో హార్వెస్ట్ కార్యక్రమంలో భాగంగా ఇంకుడు గుంతల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. జూలూరుపాడు–2, 3, పాపకొల్లు–3, అన్నారుపాడు, పడమటనర్సాపురం, కొమ్ముగూడెం అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇంకుడు గుంతల నిర్మాణం కోసం అధికారులు మార్కింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ చంద్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మలజ్యోతి మాట్లాడుతూ... వర్షపు నీరు వృథా కాకుండా భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఆమె అంగన్‌వాడీ కేంద్రాల్లో రికార్డులు, రిజిస్టర్లు, స్టాక్ నిలవలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఈజీఎస్ ఏపీఓ రవికుమార్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్స్ ఎం.లక్ష్మి, నాగమణి, డి.శకుంతల, పంచాయతీ సెక్రటరీలు, అంగన్‌వాడీ టీచర్లు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్. దుర్గాంప్రసాద్ -79979 58226 టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148